చింతపల్లి ఆస్పత్రికి సమస్యల సుస్తీ

- డాక్టర్ల కొరతతో అందని సేవలు
- ఖాళీగా జనరల్,మత్తు, స్త్రీ వైద్యుల పోస్టులు
- చిన్నపాటి శస్త్ర చికిత్సలకూ పాడేరు, నర్సీపట్నం రిఫరల్
- సకాలంలో వైద్యం అందక అవస్థలు పడుతున్న రోగులు



చింతపల్లి ఏరియా ఆస్పత్రి



ఆస్పత్రి వార్డులో చికిత్స పొందుతున్న రోగులు



వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులు

చింతపల్లి: జిల్లాలో గిరిజనులకు వైద్యసేవలందించడంలో మూడవ పెద్ద దిక్కుగా ఉన్న చింతపల్లి ఏరియా ఆస్పత్రి సమస్యలతో కునారిల్లుతోంది. డాక్టర్ల కొరత వేధిస్తుండంతో సరైన వైద్యం అందక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి శస్త్ర చికిత్సలకు కూడా వేరే ఆస్పత్రులకు రిఫర్ చేయాల్సి వస్తోంది. పాడేరు జిల్లా ఆస్పత్రి కాగా అరుకు,రంపచోడవరం, చింతపల్లిల్లో ఏరియా ఆస్పత్రులున్నాయి.

రోజూ 250 పైగా ఓపీ

మండలంలోని కోరుకొండ, లంబసింగి, తాజంగి, లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జీకే వీధి మండలంలో జెర్రల,పెదవలస,ఆర్వీ నగర్, జీకే వీధి,సప్పర్ల,దారకొండ,సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన రోగులతో పాటు కొయ్యూరు, జి.మాడుగుల సరిహద్దు ప్రాంతాల రోగులు మెరుగైన వైద్యానికి ఈ ఆస్పత్రికి వస్తారు. ఈ ప్రాంతంలో గిరిజనులకు ఉన్నత వైద్యం అందించిందేకు 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, 100 పడకల ఆస్పత్రిగా ప్రభుత్వం స్థాయిని పెంచింది. రోజూ వైద్యసేవలు పొందేందుకు ఈ ఆస్పత్రికి 250 నుంచి 300 మధ్య రోగులు వస్తుంటారు.

ముఖ్యమైన వైద్య పోస్టులన్నీ ఖాళీ

ఆస్పత్రిలో అత్యవసరమైన స్త్రీ వైద్య నిపుణులు,జనరల్ సర్జన్,జనరల్ మెడిసిన్,మత్తు,కంటి వైద్య నిపుణులు పోస్టులనన్నీ ఖాళీగా ఉన్నాయి. స్త్రీ వైద్య నిపుణులు ముగ్గురు గాను ఒకరు రాజీనామా చేయగా, మరొకరు మెటర్నిటీ లీవులో ఉన్నారు. మిగిలిన ఒక్కరికీ నర్సీపట్నం ఆర్ఎంవోగా బదిలీ అయ్యింది. మైదాన ప్రాంతం నుంచి డిప్యుటేషన్‌పై వారానికి ఒక్కరికి చొప్పున ఈ ఆస్పత్రిలో విధులు నిర్వహించే బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు పూర్తి స్థాయి వైద్యం అందడం లేదు. గతంలో మత్తు వైద్య నిపుణులు, శస్త్ర చికిత్స వైద్య నిపుణులు కూడా ఉండటంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇక్కడే మెరుగైన వైద్యం అందేది. ఆస్పత్రిలో ఉన్న ఈ ముగ్గురు వైద్య నిపుణులు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ప్రస్తుతం వైద్య నిపుణులు లేక ప్రతి చిన్న వైద్యానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, పాడేరు జిల్లా ఆస్పత్రికి రిఫరల్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

వైద్య పరీక్షలకూ ఇబ్బందులే...

ఆస్పత్రికి వచ్చిన రోగులకు కనీస పరీక్షలు చేసే సౌకర్యాలు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క ఎక్స్‌రే ప్లాంటు తప్ప సిటీ స్కాన్,ఎంఆర్ఐ స్కాన్‌తో పాటు దంత వైద్యులకు అవసరమైన ఎక్స్‌రే,సిమ్మెంట్, దంతాల క్లీనింగ్ వంటి పరీక్షలకు తగిన సౌకర్యాలు అందుబాటులో లేవు. నిత్యం పాడేరు, నర్సీపట్నం ఆస్పత్రులు రోగులను తరలించవలసి వస్తుండడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో రెండు అంబులెన్స్‌లు సరిపోవడం లేదు.

పార్కింగ్ లేక ఇక్కట్లు..

ఆస్పత్రికి రోగుల తాకిడి అధికంగా ఉంటోంది. రోగులు, వారి బంధువులు ఆస్పత్రికి ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల్లో వస్తుంటారు. ఆస్పత్రిలో అనువైన పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఆస్పత్రి ఆవరణలో ఎక్కడి పడితే అక్కడ పార్కింగ్ చేసి వైద్యం కోసం వెళ్తున్నారు.



ఆస్పత్రిలో మూతపడిన ఆపరేషన్ థియేటర్

23 పోస్టులకు గాను ఉన్నది ఏడుగురే..

ఈ ఏరియా ఆస్పత్రిలో 23 మంది వైద్యులు,63 మంది వైద్య సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం ఇక్కడ కింద స్థాయి సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నప్పటికీ వైద్యుల కొరతతో రోగులకు సకాలంలో సక్రమంగా వైద్య సేవలు అందడం లేదు. జనరల్ సర్జన్ 2, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు 2, స్త్రీల వైద్య నిపుణులు 3,మత్తు వైద్య నిపుణులు 2, చిన్నపిల్లలు వైద్యనిపుణులు 2, ఆర్ఎంవో 1, ఎముకలు వైద్యులు 2, దంత వైద్యులు 2, ఈఎన్ టీ 1, కంటి వైద్య నిపుణులు 1,పెతాలిజిస్టు 1,సాధారణ వైద్యులు ముగ్గురు ఉండాలి. కాగా 23 పోస్టుల్లో సివిల్ సర్జన్ స్పెషలిస్టులు ఐదు గురు,సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు 11 మంది,సివిల్ సర్జన్ 1(ఆర్ఎంవో)డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్టు 1, డిప్యూటీ సివిల్ సర్జన్ జనరల్ 1, డిప్యూటీ డెంటల్ సర్జన్ 1, సివిల్ అసిస్టెంట్ సర్జన్ జనరల్ ముగ్గురు ఈ ఆస్పత్రిలో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉంది. అయితే వీరిలో ప్రస్తుతం ఒక చిన్నపిల్లల వైద్య నిపుణులు, ఒక దంత వైద్యులు,ఎముకులు,ఈఎన్‌టీ,పెతాలిజిస్టుతో పాటు ఇద్దరు జనరల్ వైద్యులతో కలిపి ఏడుగురు ఉన్నారు. మిగిలిన 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వైద్య నిపుణులను నియమించాలి



ఆస్పత్రిలో వైద్య నిపుణులు లేక గిరిజన రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు ఏరియా ఆస్పత్రి అయినప్పటికీ పీహెచ్‌సీలో స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయి. ముఖ్యమైన స్త్రీ వైద్య నిపుణులు,మత్తు వైద్యులు,శస్త్ర చికిత్స వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు మండలాలకు పెద్ద దిక్కుగా ఉన్న ఈ ఆస్పత్రిలో ముఖ్యమైన వైద్యనిపుణులను నియమించి, మెరుగైన వైద్య సేవలందించ డానికి ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలి.

– దురియా పుష్పలత, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు, చింతపల్లి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం



ఏరియా ఆస్పత్రిలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.ప్రస్తుత ఉన్న వైద్యులతోనే మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. ముఖ్యమైన వైద్య నిపుణులు లేక పోవడం వల్లే ఉన్నత వైద్యానికి నర్సీపట్నం,పాడేరు ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోంది. డిప్యుటేషన్ వచ్చిన స్త్రీ వైద్య నిపుణులతోనే గర్భిణులకు వైద్య సేవలందిస్తున్నాం.త్వరలోనే వైద్య నిపుణులను నియమించే అవకాశం ఉంది.

– జి.ప్రభావతి, సూపరింటెండెంట్,ఏరియా ఆస్పత్రి చింతపల్లి

క్లుప్తంగా

కాఫీ గింజలను దళారులకు విక్రయించి నష్టపోవద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కాఫీ విభాగం మండల కోఆర్డినేటర్ చిన్నారావు

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు కాఫీని గింజలను దళారులు, వ్యాపారులకు విక్రయించి నష్టపోవద్దని గూడెంకొత్తవీధి కాఫీ విభాగం మండల కోఆర్డినేటర్ చిన్నారావు అన్నారు. అమ్మవారి దారకొండ పంచాయతీ పెబ్బంపల్లిలో కాఫీ రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. సర్పంచ్ సత్యవతి, వైస్ సర్పంచ్ చంటిబాబు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ, మాక్స్, జీసీసీ కలిపి ఈసారి కాఫీకి మంచి గిట్టుబాటు ధరలు కల్పించాయన్నారు. ఈకార్యక్రమంలో లైజన్ వర్కర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో చర్మవ్యాధులు దూరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పాడేరు ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర

డుంబ్రిగుడ: వ్యక్తి గత పరిశుభ్రతతో గజ్జి, దురదలు తదితర చర్మవ్యాధులు రాకుండా నివారించుకోవచ్చని పాడేరు ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఏటీడబ్ల్యూవో మల్లికార్జున ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వామిత్ర మాట్లాడుతూ ప్రతి రోజూ స్నానం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల వార్డెన్ పాలసి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వన సమారాధన

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల బాలికల వన సమారాధన కార్యక్రమం మంగళవారం సందడిగా జరిగింది. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన విందులో స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెట్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

లోతేరు వారపు సంతలో సదుపాయాలు కల్పించాలి

అరకులోయటౌన్: మండలంలోని మారుమూల లోతేరు వారపు సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ లోతేరులో మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ ఈ వారపు సంతకు వందలాది మంది గిరిజనులు వస్తారని, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారపు సంత ప్రాంగణంలో షెడ్లు, తాగునీరు, సులభ్ కాంప్లెక్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిన స్వామి, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టిరోడ్డు పనులు ప్రారంభం



మట్టి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సూరిబాబు

జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామంలో మట్టి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ టి.సూరిబాబు ప్రారంభించారు. 200 మీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నట్టు ఆయన చెప్పారు.

23న సత్య సాయి జయంతి వేడుకలు

అడ్డతీగల: సత్యసాయిబాబా జయంతిని ఈనెల 23న అడ్డతీగలలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సత్యసాయి సేవా సమితి, సాయి లలిత సత్సంగ్ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.ఆరోజు ఉదయం నుంచి రాత్రి వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, షిర్డీ సాయిబాబా మందిరం వద్ద పేదలకు రగ్గులు,వస్త్రాల పంపిణీ,అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

పశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



సంగడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి సౌజన్యదేవి

ముంచంగిపుట్టు: పశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పశువైద్యాధికారి ఎం.సౌజన్యదేవి తెలిపారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ సంగడ, లక్ష్మీపురం పంచాయతీ కోడాపుట్టులలో మంగళవారం పశుసంవర్ధక, వ్యవసాయ,ఉద్యానవనశాఖలఅధికారులు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల సంరక్షణ, అందించాల్సి టీకాలు,ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు.తప్పనిసరిగా నట్టలనివారణ టీకాలు వేయించాలని, పశువులు ప్లాస్టిక్ పదార్థాలు తినకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పచ్చగడ్డినే మేతగా వేయాలని,పశు సంపదను వృద్ధి చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో సర్పంచులు త్రినాథ్,మిల్కి, ఏవో శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణం పూర్తి

- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



తారు రోడ్డు పనులను పరిశీలిస్తున్న జర్రెల సర్పంచ్ భాగ్యవతి

ముంచంగిపుట్టు: మండల కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న జర్రెల పంచాయతీ కేంద్రంలో చేపట్టిన తారురోడ్డ నిర్మాణం మంగళవారంతో పూర్తయింది. దీంతో పంచాయతీ వాసుల ఎన్నోఏళ్ల కల ఫలించింది. తారురోడ్డుకోసం గ్రామస్తులు పలుమార్లు ఆందోళనలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ప్రస్తుత జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.1.50 కోట్లు మంజూరు చేయించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర,ఎంపీపీ సీతమ్మ,సర్పంచ్ భాగ్యవతి ప్రత్యేక చొరవతో రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ మండల నేతలు సుందరరావు,సురేష్ మంగళవారం పరిశీలించారు.

వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి



సూచనలు చేస్తున్న ఏవో ఉమాదేవి



కురిడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో నీలవేణి

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని, వాణిజ్య ప్రాధాన్యం ఉన్న పంటలను పండించాలని మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు తెలిపారు. జర్రెల, వంచుల పంచాయతీల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన లాభదాయక పంటలు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించారు. వంచుల సర్పంచ్ కాసులమ్మ, జర్రెల ఎంపీటీసీ సత్యవతి, వీహెచ్ఏ చలం, వీఏఏ శశాంక్ పాల్గొన్నారు.

కొయ్యూరు: వరిలో రెల్ల రాల్చే పురుగు నివారణకు రైతులు మోనో్క్రోటాపాస్ 400 మిల్లీలీటర్లను ఎకరానికి పిచికారీ చేయాలని ఏవో ఉమాదేవి సూచించారు. గంగవరం,కొయ్యూరులలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రభాకర్,రూప పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి నీలవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాగుల సేకరణ వచ్చే నెల 3వ వారంలో ప్రారంభమతుందన్నారు. ఈకార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది శెట్టి త్రినాథ్‌రావు, గిరిజనులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్ అధికారులు, విద్యార్థులు



గూడెంకొత్తవీధిలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ప్రసాద్



అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో లవరాజు, అధికారులు



జి.మాడుగులలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో తేజ్‌రతన్, ఎంపీటీసీ, సర్పంచ్‌లు



రాజవొమ్మంగి ఎస్సీ కాలనీలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాక్షి,పాడేరు/జి.మాడుగుల/గూడెంకొత్త వీధి/రాజవొమ్మంగి/కొయ్యూరు/అరకులోయ టౌన్: బహిరంగ మల విసర్జన వల్ల కలిగే అనర్థాలను, మరుగుదొడ్ల వినియోగం ఆశవ్యకతను వివరిస్తూ పలు ప్రాంతాల్లో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని, అందరూ టాయిలెట్లను వినియోగించాలని సూచించారు. పాడేరు పాతబస్టాండ్ అంబేద్కర్ సెంటర్‌లో విద్యార్థులు, అధికారులు మానవహారం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రమేష్,డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు. జి.మాడుగులలో మండల పరిషత్ కార్యాలయం నుంచి జీపుల స్టాండ్ జంక్షన్ వరకు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తేజ్‌రతన్ మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకుమార్, ఐసీడీఎస్ పీవో సువర్ణమ్మ, ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర,అప్పారావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, సర్పంచ్‌లు ఐసరం హనుమంతరావు,సీదరి కొండబాబు, కృష్ణమూర్తి,పెదబాలన్న,గంగరాజు, కొండబాబు,మాజీ సర్పంచ్ పండుదొర,ఎంఆర్‌సీ సావిత్రి పాల్గొన్నారు.గూడెంకొత్తవీధిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఈవోపీఆర్డీ పాపారావు, తాగునీటి సరఫరా విభాగం ఏఈఈ కల్యాణ్ రామ్ పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ సచివాలయ సిబ్బంది పాల్గొని మరుగుదొడ్ల ఆవశ్యకతను వివరించారు. రాజవొమ్మంగి ఎస్సీ కాలనీలో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ టాయిలెట్ డే కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీతారాం, వెలుగు ఏపీఎం రామాంజనేయులు, ఉపాధి ఏపీఎం వందే సురేష్‌కుమార్, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, సీసీ రామకృష్ణ, వీవోఏ వీణారాణి తదితరులు పాల్గొన్నారు. కొయ్యూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్ తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు.అరకులోయలో ఎంపీడీవో లవరాజు, జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, డీఈఈ రుకమానురాజు, పద్మాపురం, మాడగడ పంచాయతీల్లో సర్పంచ్ సుస్మిత, జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలరాజు, నరసింహమూర్తి, సుబ్రయ్య తదితరులు వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి



సంఘీభావం తెలుపుతున్న జోసెఫ్

సాక్షి,పాడేరు: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సీఆర్టీలు, ఇతర సిబ్బందిని ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.కె. జోసెఫ్ డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ ఎదుట గురుకుల అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నిర్వహించిన రిలే దీక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి, సంఘీభావం తెలిపి, దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు అన్నిశాఖల్లోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



భక్తులతో పూజలు చేయిస్తున్న పంచాంగకర్త రామకృష్ణశర్మ

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ పంచాయతీ గురమంద విశ్వనాథుని సన్నిధిలో మంగళవారం శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించినట్టు తాడేపల్లి గూడెంకు చెందిన ప్రముఖ పంచాంగకర్త పళ్ళావఝుల రామకృష్ణశర్మ తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణంతో పాటు రుద్రాభిషేకం, రుద్ర హోమం జరిపినట్టు చెప్పారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ పల్లాల పద్మావతి దంపతులు, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి దంపతులు, స్థానిక తహసీల్దార్ పి.వేణుగోపాల్, రాజానగరానికి చెందిన ఉల్లి భవానీశంకర్ గురుస్వామి పాల్గొన్నారు.

రోడ్డు బాగు కోసం ఆందోళన



రహదారిని బాగు చేయాలని ఆందోళన చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలో కించాయిపుట్టు పంచాయతీ రాములు గ్రామ రహదారిని బాగుచేయాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాములు,గడ్డిబంద గ్రామాల గిరిజనులు మంగళవారం ఆందోళన చేశారు. రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న రహదారికి మరమ్మతులు చేయాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను మాట్లాడుతూ ఈ రోడ్డు దుస్థితిని పలు మార్లు కలెక్టర్,ఐటీడీఏ పీవోల దృష్టి తీసుకెళ్లినా స్పందన లేకపోయిందని, ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి, రోడ్డును బాగు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎన్‌పీసీఐపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందికి మంగళవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. మండలంలో అన్ని గ్రామాల్లో నివాస గృహాల జీయో ట్యాగింగ్, లబ్ధిదారుల ఆధార్, ఫోన్ నంబర్లు అనుసంధానంపై ఎంపీడీవో పి.జి.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నరసింగరావు, ఏపీవో ప్రకాశ్, ఏవో సిద్ధేశ్వరరావు, నీతి అయోగ్ ప్రతినిధి హేమామాధిరి పాల్గొన్నారు.

ఘనంగా అంబలం పూజ



అంబలం పూజలో పాల్గొన్న స్వాములు, భక్తులు

చింతపల్లి: స్థానిక పెద్దపైపు వద్ద సోమవారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. చల్లా రాజు,హేమలత దంపతుల ఆధ్వర్యంలో గురుస్వాములు గంటా మురళి, గంపరాయి విజయకుమార్,పైలా శ్రీనివాసరావు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజానంతరం ప్రసాద వితరణ జరిపారు. గురుస్వాములు జోగి, బొడ గంగరాజు,పవన్‌స్వామి తాతాలు ,నాని తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

రాజవొమ్మంగి : పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో-2 సూరయ్యరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్పెషల్ క్లాసులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం మరో గంట పాటు ఈ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.